


# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుడ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

*కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో*
*అలనాటి అందమైన నవల పునర్ముద్రణ*
(ప్రారంభం)

1

**మధుబాబు** – పదిహేనేళ్ళ వయస్సులో వున్నప్పుడు కథలు రాయటం మొదలు పెట్టాడు. రాయాలన్న జిజ్ఞాస ఓ దృశ్యం చూశాక ఆ నాటి సాయంత్రం కలిగింది. ఆ దృశ్యం యిది. ఢిల్లీ నుంచి హిందూ ముస్లిం తగాదాలకు వెరచి అతని అక్క సరస్వతిని బావ పంపించేసినప్పుడు ఆమె ఒక్కగానొక్క ముద్దు బిడ్డడు నానీకి కడుపులో బల్ల పెరిగి కామెర్లు వచ్చినై. ఆ చిన్న ప్రాణాన్ని కాపాడ్డానికి మళ్ళా ప్రయత్నం జరిగింది. మొదట కూతురు ప్రాణానికి, ప్రాణాన్ని రక్షించటానికి

యింటిల్లపాదీ తల్లడిల్లిపోయారు. పదిహేనేళ్ళ మధుబాబు ఆ పసిగందు అంటే ప్రాణం యిచ్చేవాడు. పసివాడు బ్రతకడని తల్లీ, తండ్రి కూతురికి తెలియకుండా దుఃఖపడటం చూసి రాత్రంతా వెక్కి వెక్కి ఏడ్చాడు. తెల్లవారింది. సూర్యుడు పదిబారలు ముందుకు పరిగెత్తాడు. ప్రపంచం అలవాటుగా సందడిలో పడింది.

ముందు గదిలోంచి సరస్వతి పెట్టిన గావుకేక యిల్లంతా ధ్వనించింది. వంటింట్లోంచి నడిచివస్తున్న మధుబాబుకు గుండె గుబగుబలాడింది. అంతా పరిగెత్తారక్కడికి. పసివాడు అంత్యదశలో ఉన్నాడు. అక్క వొడిలో అభాగ్యురాలి కౌగిలిలో యమకింకరులతో పోట్లాడుతున్నట్లు యాతన అనుభవిస్తున్నాడు. క్రమంగా కళ్ళు తేలవేసి, ముట్టుకునేందుకు భయపడేటట్లు వున్నాడు. మధుబాబు తల్లీ, తండ్రీ నిశ్శబ్దంగా ఏడుస్తున్నారు. ఇరుగూ, పొరుగు వాళ్ళూ, దారినపొయ్యేవాళ్ళూ చుట్టూ మూగారు. మధుబాబు ఏడుస్తూ తల పైకెత్తి చూశాడు. ఓ పదేళ్ళ అమ్మాయి పెద్ద పెద్ద కళ్ళతో ఎదురుగా నిల్చుని వుంది జనంలో. వాయిలు లంగా, చిట్టిగౌను వేసుకుని తెల్లగా,చక్కగా, బీదగా, లేతగా వుంది. జుత్తు ముఖం మీద చెదురుగా పడి ముంగరుల మధ్యగా కళ్ళనుండి ముత్యాలవంటి నీటిబిందువులు చిన్నారి చెంపలమీదుగా జారిపోతున్నాయి. ఆ పాప ఏడుస్తోంది ఏమిటి? ఏమిటి సంబంధం? ఇంత కరుణ ఎలా దాగివుంది అంత బుల్లి హృదయంలో? నానీ వంకే దృష్టి నిల్పి చూస్తు కన్నీళ్ళు విడుస్తోంది. ఇంతలో ప్రకృతి వికృత ఘోష చేసింది. అంతా ఘొల్లుమన్నారు.

దూరంగా పరిగెత్తే రైలుబండి కూత, ఎదురింట్లో మేకపోతు అమానుష వధ, అస్తమిస్తోన్న సూర్యుడి కొండశిఖరం మీద అర్థంలేని సౌందర్యం, దగ్గర్లో రావిచెట్టు చిత్రమైన ఆకుల కదలిక, యింట్లోని – అబ్బా! యీ దారుణ నిశ్శబ్దం...

ఆ అమ్మాయి ఎందుకు ఏడ్చింది? అనుకున్నాడు మధుబాబు డాబామీద నిలబడి – ఆ సంధ్యాకాంతుల్లో,

ఏదో విరక్తి యింత చిన్న వయస్సులో? అర్థంకాని అయోమయభ్రాంతి జీవిత విషాదాలపై, నూతన ఆలోచనలపట్ల.

అవునూ! ఏమిటి మానవత్వమంటే? ప్రపంచంలో ఒకరికీ ఒకరికీ మధ్య సంబంధమేమిటి? బ్రతుక్కీ, చావుకీ తేడా ఏమిటి? ఎందుకు ఏడుస్తారు, సంతోషిస్తారు జనం ఒకరి గురించి ఒకరు? ఒకవేళ ఏకాకిగా జీవించటంలోనే సుఖం ఉందేమో? సాధ్యమౌతుందా అది ఈ భూమ్మీద?

పడమట సూర్యుడు అస్తమించాడు. చీకటి ఛాయలు ఎగబ్రాకుతున్నాయి భూమ్యాకాశాలకు. ఎందుకీ లోతైన, వింతయిన, క్లిష్టమైన ఆలోచనలు యిప్పుడు? ఆ చచ్చిపోయే దృశ్యం తనని కదిపింది, కుదిపింది. స్మశానంలో గోతిలో బొమికలుగా మారుతున్నాడు గావును నాని.

అబ్బ! పాపం ఆ అమ్మాయి ఏడ్చింది. ఏమిటో అసంతృప్తిగా ఉంది తనకు. అదేమిటో తెలీదు. ఎవరితోనైనా పంచుకోవాలి యీ అవస్థ. కానీ ఎట్లా తనకే తెలియందే. ఈ దుఃఖం, వేదాంతం, చావటం, ఏడవటం ఎట్లా భరిస్తాడు తను? అమ్మతో చెప్పుకోవాలి. కోప్పడుతుంది అమ్మ. నాన్నతో.. అసలు వినిపించుకోడు.

తనతోనే చెప్పుకోవాలి.

ఆ రాత్రి ఆ చీకటిలో ఆ చెలరేగిన మనసులోని దుమారంతో మధుబాబుకి ఏదో చప్పున స్ఫురించింది. అతనికి అర్థమైనట్లుగా వుంది.

రాత్రి పన్నెండు దాటుతోంది. నిద్రపోతోందో, ఏం చేస్తోందో తెలీదుగాని దుఃఖంతో అలిసిపోయిన సరస్వతి ఓ గదిలో చాపచుట్టలా పడివుంది. ఢిల్లీకి ఆమె పెనిమిటికి వైరు వెళ్ళింది. పెద్దగదిలో తల్లీ, తండ్రీ, పిల్లలూ అంతా పడుకుని ఉన్నారు.

మధుబాబు చదువుకోసం ప్రత్యేకంగా ఓ గది వుంది. అతను లైటు వేసుకుని డ్రాయరుముందు కూర్చుని రాస్తున్నాడు. ఏకదీక్షగా, మనుషుల గురించి, మమతలని గురించి. తనకు తెలియని ప్రేమ, వాత్సల్యాలని గురించి, కుక్కపిల్ల విశ్వాసాన్ని గురించి, పులిపిల్ల క్రూరత్వాన్ని గురించి.

అతనికి నిద్రవిషయం జ్ఞాపకం రావటంలేదు. రాస్తున్నాడు ఓపిగ్గా. పేజీలకు పేజీలు దొర్లిపోతున్నాయి. కుదురులేని అక్షరాలు గుంపులు గుంపులుగా ప్రోగుపడ్తున్నాయి.

మధుబాబు తనకు తెలీకుండానే ఓ కథ తయారుచేస్తున్నాడు. అందులో జంతువులూ, మనుషులూ, పక్షులూ, అన్నీ పాత్రలే. అన్నీ మాట్లాడతాయి. ఆ మాటకు భాష పొందిక లేదు. శైలి లేదు. భావం కొంచెం వుంది. స్పష్టత బొత్తిగా లేదు. ఉండదు, ఉండకూడదు ఆ ఉద్రిక్తస్థితిలో అసలు స్పష్టత వున్న బాధలో నిగూఢత వుండదు. ***ఒక చావు మనిసిని కన్నీళ్ళపాలు చేయవచ్చును గాని ఆ కన్నీళ్ళు కేవలం ఆ ఒక్క చావుని గురించే అయివుండకూడదు***

దానికి పరిధి వుండకూడదు. పరిధి వున్న ఆవేశానికి భాషతో సాము చేయనక్కర్లేదు. ***అవధులు లేని అంతర్యం ఎక్కడవుందో నిజమైన మానవత్వం అక్కడే మిళితమై వుంది. మంచీ చెడూ, పుణ్యం – పాపం, శాంతి – భీభత్సం అన్నీ కలగాపులగంగా కలిసి వున్నవాడే సమగ్రమైన మానవుడు.***

అంతలో అతని కథలోకి ఓ పదేళ్ళ పాప ప్రవేశించింది. ఆ అమ్మాయి ఓ చచ్చిపోయిన రామచిలుకని చూసింది. ఆ అమ్మాయి ఏడ్చింది, ఇంతలోనే ఎక్కడినుంచో ఓ ఎలుక వచ్చి "పాపా! నువ్వెందుకేడుస్తున్నావూ?" అనడిగింది జాలిగా.

ఆ పాప "చిలుక చచ్చిపోయింది" అని చెప్పింది.

"ఈ చిలుక ఎంత అందంగా వున్నదో చూడు ఎలుకా ఆకుపచ్చగా, బలే తమాషాగా, ఏమి సొగసు పాపం దాని ఆయుష్షు తీరిపోయింది"

ఎలుక ఆలోచించింది. "నే బ్రతికించనా పాపా?"

ఎలా?"

"నా ప్రాణమిచ్చి"

"అమ్మో! మరి నువ్వు చచ్చిపోవూ"

"చిలుక అందంగా వుంటుంది. చిలుకను చూసి ఆనందిస్తారు. నా ప్రాణం వుండి లాభమేమి?" అని అది తన ప్రాణం యివ్వటానికి ఆయత్తపడింది.

పాప భయంతో జలదరించిపోయి, దాన్ని ప్రాధేయపడి, వారించి "ప్రపంచంలో విలువలేని ప్రాణం లేదు చిలుకా. గుర్తుందా నువ్వోసారి సింహాన్ని రక్షించావు. ఓ వేటగాడి బారినుండి అనేక పావురాల్ని కాపాడావు. వద్దు వద్దు. నువ్వు ఆత్మహత్య చేసుకోవద్దు" అంటూ మళ్ళీ ఏడ్చింది.

"నువ్వు యిప్పుడు ఎందుకేడుస్తున్నావూ?"

"నాకు తెలియదు."

అంతటితో కథ ఆగిపోయింది. చాలా పెద్ద కథ తయారయింది.

"మనుషులు ఎందుకు ఏడుస్తారు?" అని పెట్టాడు కథ పేరు. ఒక నిముషము ఆలోచించి "పాప ఎందుకు ఏడ్చింది?" అని మార్చాడు. చాలా రాత్రయింది. కనకదుర్గ గుడిమీద మూడు గంటలు కొట్టారు, అతను బాగా అలిసిపోయాడు. చేతులు నొప్పులు పుట్టాయి. తల అంతా గందరగోళమైపోయింది. లేచి లైటు తీశేశాడు. అతనికి భయంవేసింది. ఈ గదిలో మంచం వుండదు. తల్లీ, తండ్రీ పడుకుని వున్న గదిలోకి వెళ్ళి చీకట్లో తడుముకుంటూ తన మంచం మీదకు చేరి పడుకున్నాడు. మరునిమిషంలో గాఢంగా నిద్రపట్టేసింది.

2

సరస్వతి అంటే మధుబాబుకు చిన్నప్పటినుంచీ ప్రాణం. ఆమె అతనికంటే వయస్సులో రెండు సంవత్సరాలు పెద్ద. ఈ పదిహేడేళ్ళకే మాతృత్వంలోని సాధకబాధకాలు అనుభవించేసింది. స్కూల్ ఫైనల్ వరకూ చదువుకుంది సరస్వతి. పరిక్ష అయిపోగానే పెళ్ళికావటం, కొద్ది మాసాల్లోనే కాపురానికి వెళ్ళిపోవటం, ఏడాది తిరిగేసరికి మాతృమూర్తి కావటం గబగబా జరిగిపోయాయి.

ఆమె స్కూల్ ఫైనల్ చదువుతున్నప్పుడు, అతను ఫోర్తుఫారం చదువుతుండేవాడు. ఇద్దరూ కలిసి స్కూలుకి నడిచిపోతూండేవారు. వాళ్ళు స్కూలికి పోయేదారిలో ఓ యిల్లు ఉండేది, చిన్న పెంకుటిల్లు. అందులో ఓ స్త్రీ నివసిస్తూ వుండేది. పదిహేడు, పద్దెనిమిదేళ్ళ సుందర స్వరూపం ఆమెది.

తళతళ మెరిసే శరీరచ్ఛాయా, చెంపకు చారిడేసి కళ్ళు. చూపరులని మంత్రముగ్ధులని చేసే లావణ్యం, ఎప్పుడూ చిరునవ్వుతో కళకళలాడూతుండేది.

ఆమె ఎవరో యీ పిల్లలకు తెలియదు. అక్కడికి ఎట్లా వచ్చిందో అంతకంటే తెలియదు. కానీ రోజూ వీళ్ళు వచ్చేపోయేవేళ కిటికీ దగ్గర నిలబడి సకౌతుకంగా తిలకిస్తూ ఉండేది. ఓ సాయంత్రం బడినుంచి తిరిగివస్తున్నప్పుడు తలుపులు తీసి గుమ్మం ఇవతలకు వచ్చి చెయ్యెత్తి పిలిచింది. తమనేనా అనుకున్నారు మొదట.

"నా దగ్గరకు రారూ?" అన్నది మళ్ళీ మృదు కంఠంతో.

మధుబాబుకు ఆమె దగ్గరకు పోదామని ఆత్రంగా వుంది. కాని సరస్వతి తటపటాయిస్తోంది, ఈ అపరిచిత యువతి చెంతకు ఎట్లా వెళ్ళటమా అని.

మధుబాబు చొరవచేసి అక్క చెయ్యి పట్టుకుని మెల్లగా అక్కడికి తీసుకుపోయాడు.

"సందేహిస్తున్నారు కదూ" అన్నది ఆమె ముత్యాలవంటి పలువరస ప్రదర్శిస్తూ నవ్వి.

అక్కా, తమ్ముడూ సిగ్గుతో తలవంచుకున్నారు.

ఆ స్త్రీ పేరు రజని. కూలీనాలీ చేసుకునేవాళ్ళ కుటుంబంలో జన్మించింది. బాల్యంలోనే తల్లినీ, తండ్రిని పోగొట్టుకున్న హతభాగిని. అప్పటినుంచీ తెలిసినవాళ్ళు ఎవరో దగ్గరకు చేరదీసి కొంచెం పెద్దయినాక తమతోపాటు కూలి పనికి తీసుకుపోతూ పెంచారు పదహారేళ్ళ నూతన యవ్వనంలో తనని పెంచినవాళ్ళతో కలిసి బెజవాడ వచ్చేసింది. కూలిపని చేసుకునేవారిలో యీ సౌందర్యం, సోయగం, సుకుమారత్వం అరుదుకదా. యువకులు పిచ్చెక్కిపోయారు. వలలు పన్నారు. వాళ్ళు ఎంతవరకు సఫలీకృతులైనారో తెలీదుగాని ఆమె పనిచేస్తున్న సున్నపు మిల్లు యజమాని రాజయ్యగారి కళ్ళు ఆమె మీదపడ్డాయి. అజమాయిషీ చేసే నెపంతో రోజూ వాళ్ళ మధ్యకు వచ్చి ఆమెను చూసి గుటకలు మ్రింగుతూ వుండేవాడు. నలభై ఏళ్ళు పైబడిన మనిషి ఆయన. ఈ వ్యామోహానికి తట్టుకోలేకపోయాడు.

ఓ రోజు మధ్యాహ్నం విరామసమయంలో ఆమె చెట్టుకు చేరగిలబడి కూర్చున్నప్పుడు వచ్చి "నీకు డబ్బు యిస్తాను, ఇల్లు అమరుస్తాను, సమస్త సౌకర్యాలూ సమకూర్చుతాను నాతో వచ్చేస్తావా?" అని అడిగాడు.

ఆమె లేచి నిల్చుని తన పెద్ద పెద్ద కళ్లను ఎత్తి ఆయనవంక సాలోచనగా చూసింది. ఒక్క నిమిషంలో అంతా నిర్ణయించుకుంది. "వస్తాను" అంది నెమ్మదిగా.

అంతే. రాజయ్యగారు ఓ పెంకుటిల్లు తీసుకుని ఆమెను అందులో వుంచాడు. కావలసిన సామాగ్రి అంతా కొన్నాడు. నెలకు ఇంత అని పైకం యిస్తూ ఉండేవాడు. రజని అనే పేరు ఆయన ప్రేమతో పెట్టిందే కావచ్చు.

యువకుల కల్లోలం ఏమీ తగ్గలేదు.

రాజయ్యగారు మంచి నిఘా వుంచారు.

ఈ వంటరితనంలో యీ అక్కా తమ్ముళ్ళు తోడూ నీడ అయినారు రజనికి. రోజూ యింటికి వెళ్ళేటప్పుడు అరగంట కాలక్షేపం యిక్కడ. బిస్కట్లూ, కాఫీ ఇస్తూండేది. వాళ్ళతో ఆ కబుర్లూ, యీ కబుర్లూ చెబుతూండేది. ఆమెకు చదువురాదు. నేర్చుకోవాలన్న జిజ్ఞాసలేదు.

"చినబాబూ" అని పిలుస్తూండేది మధుబాబును. ఎంతో ఆప్యాయంగా చూసేది యిద్దర్నీ.

కొన్నాళ్ళకు సరస్వతి వెళ్ళిపోయింది.

మధుబాబు వంటరిగా మిగిలాడు. మరుసటి సంవత్సరం స్కూలుకి వంటరిగా పోతుంటే ఏడుపు వచ్చేది. ఈ స్థితిలో రజని అతనికి మరింత దగ్గరగా వచ్చింది. ఊరట కలిగేది అతనికి ఆమె సాన్నిధ్యంలో వాళ్ళు ఆప్త మిత్రులైపోయేవారు. సరస్వతి అప్పుడప్పుడూ యిక్కడకు వచ్చినప్పుడు వెళ్ళి రజనిని చూసి వస్తూండేది. నానీ జన్మించినప్పుడు రజని బహుమతులు పంపించింది. ఇప్పుడు నాని మరిలేడు.

ఆ మరునాడు ఈ విషయం చెప్పటానికి మధుబాబు ఆమె ఇంటికి వెళ్ళాడు.

ఇంటికి తాళం పెట్టివుంది. ఎక్కడికయినా వెళ్ళిందేమో అనుకున్నాడు. కాసేపు ఎదురు చూశాడు.

ఎంతకూ రాలేదు రజని.

ఎదురుగా వున్న కిల్లీషాపువాడు చెయ్యెత్తి రమ్మని సౌంజ్న చేశాడు మధుబాబుని చూసి.

మధుబాబాబు వెళ్ళాడు.

"రజని కోసమా?" అన్నాడు షాపువాడు.

"అవును" అన్నాడు.

"లేదు. మరి రాదు."

"ఎక్కడకు వెళ్ళింది?"

షాపువాడు వక్రంగా నవ్వాడు. "లేచిపోయింది"

చిన్నపిల్లవాడుకాదు మధుబాబు అతనికి అర్థమైంది. చికాగ్గా ఆవేదనగా యింటి దారి పట్టాడు.

Post your comments

*(కొనసాగింపు వచ్చే నెలలో)*